సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం ׀ 24 ׀ జూలై ׀ 2024



బిక్కుబిక్కుమంటూ...
వేలేరుపాడు మండలం తూర్పు మెట్టలో ఎంత వరద వచ్చినా గుట్ట కింది భాగంలోని ఎనిమిది ఇళ్లు మాత్రమే మునుగుతాయి. మిగతా ఇళ్లు మునగవు.
IIలో ▸



ఎర్రగంగతో వ్యథ తీరేనా?
ఎర్రకాలువ రైతుల పాలిట దుఃఖదాయినిగా మారింది. ఎర్రకాలువ ఉప్పొంగి 20 గ్రామాలను ముంచెత్తడంతో 4 వేల ఎకరాల్లో పొలాలు నీటమునిగాయి.
IIలో ▸



దాతలకు అవమానం
దాతల సహకారంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలపై దాతల పేర్లను, వారి పేర్లు ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది
IIలో ▸

బడ్జెట్‌లో జిల్లాకు రిక్తహస్తం

- పోలవరంపై హామీ మాటలకే పరిమితం
- లేసు పరిశ్రమ అభివృద్ధి, నిట్ విస్తరణ నిధులకు మొండిచేయి
- రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు శూన్యం
- ఆక్వా, వ్యవసాయ రంగాలకూ నిరాశే
- బడ్జెట్ కేటాయింపులపై సర్వత్రా అసంతృప్తి



సాక్షి ప్రతినిధి, ఏలూరు: కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి చూపారు. పోలవరానికి నిధుల కేటాయింపులు మాటల గారడీతో సరిపెట్టారు. జిల్లాలోని ఉద్యానవన పంటలు, ఆక్వాకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేయలేదు. ఎన్నో ఏళ్ళుగా ప్రతిపాదనలు దాటి ఖరారైన రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. కొత్త ప్రాజెక్టులు, గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక చర్యలు ఇలా ఏ ఒక్క అంశానికి కేంద్ర బడ్జెట్‌లో చోటు దక్కలేదు. జిల్లాకు ప్రయోజనం చేకూర్చే ఒక్క ప్రాజెక్టు కూడా లేదు. వ్యవసాయ, ఆక్వా ప్రాధాన్యత ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు బడ్జెట్‌లో నిరాశే మిగిలింది. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రమాణస్వీకారం అయిన వెంటనే పోలవరానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. ఏలూరు జిల్లాలో ఆయిల్‌ఫెడ్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని, ఆయిల్‌ఫామ్‌కు మద్దతు ధర, కోకో ఎగుమతులకు ప్రోత్సాహం ఇలా అనేక హామీలు చెప్పారు. ఆక్వా రైతులకు తోడుగా ఉంటామని ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో వీటి ఊసే లేదు. నర్సాపురం లేసు పరిశ్రమ చేయూత కోసం కేంద్ర సహకారం శూన్యం. తాడేపల్లిగూడెంలోని నిట్‌కు నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు. నిట్ రెండో దశ పనులకు రూ.735 కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలను పంపగా గత బడ్జెట్, ఈ బడ్జెట్‌లోనూ నిట్ ఊసే లేదు.

పోలవరంపై ఉత్తుత్తి మాటలే.. పోలవరం పూర్తి చేస్తామని మాట చెప్పారేగాని ప్రాజెక్టు నిర్మాణానికి, పునరావాసానికి ఎంత కేటాయించేది, ఏఏ పనులకు ఎంత మేరకు నిధులు మంజూరు చేస్తున్నది ప్రస్తావనే లేదు. ముంపు మండలాల్లో దాదాపు 25,100 కుటుంబాలను తరలించారు. వీరికి కేంద్రం పునరావాస ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. ఏపీకి జీవనాడి అని చెప్పారే తప్ప సాంకేతిక, ఆర్థిక అంశాల్లో కనీసం స్పష్టత కానీ, కేటాయింపులు లేకపోవడం గమనార్హం. సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి చేయూత లేదు. నామమాత్రంగానైనా ప్రస్తావన లేదు. రాష్ట్రంలోనే అత్యధిక ఆక్వా సాగు ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఉంది. 2.20 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉన్న ఆక్వా పరిశ్రమ ధరల సంక్షోభంతో అల్లాడిపోతున్నా మద్దతు చర్యలు లేవు.

అటకెక్కిన రైల్వే ప్రాజెక్టు : జిల్లాలో కీలకంగా ఉన్న కోటిపల్లి- నర్సాపురం, కొవ్వూరు- భద్రాచలం రైల్వే ప్రాజెక్టులు అటకెక్కుతున్నాయి. గత మూడు, నాలుగేళ్ళుగా వీటికి కేటాయింపులు లేవు. ఈ ఏడాది ఎలాంటి స్పష్టత లేదు. నర్సాపురం-కోటిపల్లి మధ్య 58 కిలోమీటర్ల దూరం రూ.2,800 కోట్ల వ్యయంతో రైల్వే లైన్ నిర్మాణ పనులకు 2016లో శ్రీకారం చుట్టారు. మలివిడత నిధులు మంజూరు కాకపోవడంతో కొన్నేళ్ళుగా పనులు నిలిచిపోయాయి. గత మూడేళ్లగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. 2013లో రూ.923 కోట్లతో కొవ్వూరు -భద్రాచలం రైల్వే లైన్‌కు ఆమోదముద్ర వేసినప్పటికీ ఇప్పటి వరకు 11 బడ్జెట్‌లు గడిచినా ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు.

నిరాశపర్చిన బడ్జెట్



కేంద్ర బడ్జెట్ నిరాశపర్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండి కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఎక్కువ నిధులు కేటాయించేలా చేయడంలో విఫలమైంది. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలకు సంబంధించి నిధులు కేటాయించలేదు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్‌ల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

– బండి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, టీకేఎంయు, ఏలూరు

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. అంకెల గారడీ మినహా ఏమీ లేదు. పంటలకు మద్దతు ధర, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రస్తావనే లేదు. పోలవరం ప్రాజెక్టు పట్ల నిరంకుశ వైఖరి మరోసారి వెల్లడైంది. నిర్వాసితుల సమస్యలు గాలికి వదిలేశారు.

– మన్నవ కృష్ణ చైతన్య, జిల్లా కార్యదర్శి, సీపీఐ, ఏలూరు జిల్లా

ధరల తగ్గింపు లేదు



పేద ప్రజలకు అవసరమైన వస్తువుల ధరల తగ్గింపు లేదు. ఇది కార్పొరేట్లు, ధనిక వర్గాలకు అనుకూల బడ్జెట్‌గా ఉంది. దేశంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా బడ్జెట్ లేదు. రాష్ట్రానికి కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయాలి. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు హామీ ఇవ్వలేదు.

– ఏసుబాబు, మాజీ ఎంపీటీసీ, అడ్వకేట్

రైతులకు నిరాశే



రూ.48 లక్షల కోట్లు కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేవలం రూ.1.52 లక్షల కోట్లు మాత్రమే కేటాయింపు చేయడం అన్యాయమన్నారు. దేశంలో 58 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ రంగానికి కనీసం పది శాతం నిధులు కేటాయించాలి. రైతులు కోరుకున్న విధంగా రుణమాఫీ, మద్దతు ధరల గ్యారంటీ చట్టం వంటి అంశాలు బడ్జెట్‌లో లేకపోవడం దుర్మార్గం.

– కే.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఉద్యోగులకు అన్యాయం



బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశే మిగిలింది. ట్యాక్స్‌లో రెండు పద్ధతులున్నాయి. పాత విధానం, కొత్త విధానానికి పెద్ద తేడా ఏమి లేదు. పాత విధానంలో రూ.2.50 లక్షల వరకు పన్ను కట్టాల్సిన అవసరం లేదు. ఇప్పుడు దాన్ని మరో రూ.50 వేలకు పెంచి రూ.3 లక్షలు చేశారు. కొత్తపద్ధతి వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఏ ఒక్కరికీ ఉపయోగం లేదు. తీవ్ర నిరాశ మిగిలింది.

– ఎస్. శ్రీకాంత్, సీనియర్ అధ్యాపక సంఘ నాయకుడు

కేంద్ర బడ్జెట్‌లో మొండిచేయి



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపారు. రాష్ట్రంలోని పోలవరం నిర్వాసితులు, అమరావతి రాజధాని నిర్మాణం వంటి వాటికి నిధులు కేటాయించలేదు. పోలవరం నిర్వాసితుల కోసం తక్షణం రూ.12 వేల కోట్లు అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం కోరగా పైసా కూడా కేటాయించ పోకపోవడం దారుణం. రాష్ట్ర రాజధానికి కేంద్ర గ్రాంట్‌గా కాకుండా ఆర్థిక సంస్థల నుంచి నిధులను ఇప్పిస్తానని చెప్పడం ద్వారా కేంద్రం కపట వైఖరిని చాటుకుంది.

– ఏ రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి, ఏలూరు జిల్లా

కార్మికులు, ఉద్యోగులకు నిరాశ



బడ్జెట్ కార్మికులు, చిరు ఉద్యోగులను తీవ్రంగా నిరాశ పర్చింది. బడ్జెట్లో కార్మికుల ఊసే లేదు. ఈపీఎస్ పెన్షనర్లు కనీస పెన్షన్ పెంచాలని చాలా కాలం నుంచి పోరాడుతున్నా కనీసం ప్రస్తావించకపోవడం బాధాకరం. ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.50 వేల కోట్లు సేకరించాలని నిర్ణయించడం దారుణం. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదన వెనక్కి తీసుకుంటారని ఆశించినా దానిపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

– డీఎన్‌వీడి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ

లంకల్ని ముంచెత్తిన గోదారి

- ఆచంట, పెనుగొండ మండలాల్లో లంక భూముల్లోకి వరద నీరు
- గ్రామాల ఒడ్డును తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి
- వశిష్ట గోదావరికి పెరుగుతున్న వరద ఉధృతి
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- భద్రాచలం వద్ద తగ్గుతున్న వరద ఉధృతి
- రెండు రోజుల్లో జిల్లాలోనూ తగ్గుముఖం పట్టే అవకాశం



యలమంచిలి మండలం చించినాడ వంతెన దిగువన గట్టును తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి

సాక్షి, భీమవరం: గోదావరి వరద ప్రవాహంతో జిల్లాలోని లంక గ్రామాలను ముంచెత్తుతోంది. ఇప్పటికే లంక భూములు వరద నీటిలో చిక్కుకోగా.. తీవ్రత పెరిగితే గ్రామాల్లోకి వచ్చే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయితే భద్రాచలం వద్ద వరద ఉధృతి తగ్గుతుండటం కొంత ఊరటనిస్తోంది. అయితే ఏ క్షణం ఏం జరుగుతుందోనని అప్రమత్తంగా ఉన్నారు.

భద్రాచలం వద్ద తగ్గిన ఉధృతి

భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గుతోంది. మంగళవారం మధ్యాహ్నం 11 గంటలకు 51.4 అడుగులకు చేరుకున్న నీటిమట్టం సాయంత్రం ఐదు గంటల సమయానికి స్వల్పంగా తగ్గి 50.9 అడుగులకు చేరింది. భద్రాచలం నుంచి దిగువకు వస్తున్న జలాలతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి మట్టం పెరుగుతోంది. సాయంత్రం ఐదు గంటల సమయానికి 14.50 అడుగులకు చేరుకోగా 3,300 క్యూసెక్కుల నీటిని పంట కాలువలకు, 13.9 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారం రాత్రి నుంచి రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

తోటలను ముంచెత్తుతున్న వరద

ఆచంట, పెనుగొండ మండలాల్లోని లంక భూముల్లో అరటి తోటలను వరద నీరు ముంచెత్తింది. ఆచంట మండలంలోని కోడేరు, అయోధ్యలంక, పెనుగొండ మండలం సిద్ధాంతంలో వరద పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు. యలమంచిలి మండలం కనకాయలంక వద్ద కాజ్‌వేపై సుమారు నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది. పెదలంక, దొడ్డిపట్ల, అబ్బిరాజు, గంగడుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, ఏనుగువాని లంక, బాడవ తదితర లంక గ్రామాల్లో ఒడ్డును తాకుతూ గోదావరి ప్రవహిస్తోంది. తీవ్రత పెరిగితే నీరు గ్రామాల్లోకి చొచ్చుకు వస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. వరద ఉధృతి దృష్ట్యా ముందు జాగ్రత్తగా దొడ్డిపట్ల-అబ్బిరాజుపాలెం వద్ద పడవ, పంటు ప్రయాణాన్ని అధికారులు నిలిపివేశారు. నరసాపురం మండలం కొత్త నవరసపురం ఎస్సీ కాలనీలోకి వరద నీరు చొచ్చుకు వస్తోంది. పట్టణంలోని లాకుపేట ప్రాంతం, రెండో వార్డు పొన్నపల్లి వద్ద గోదావరి అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి నీరు పల్లపు ప్రాంతాలకు చేరుతోంది.

ఒకటి రెండు రోజుల్లో తగ్గుముఖం

భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో జిల్లాలోనూ తీవ్రత తగ్గుతుందని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు. వరద నీరు నరసాపురం రూరల్ బియ్యపుతిప్పలోని సముద్రంలోకి చేరే వరకు వశిష్ట గోదావరి పరీవాహక ప్రాంతం వెంట ముంపు బెడద పొంచి ఉంటుందని చెబుతున్నారు.

పునరావాస ఏర్పాట్ల పరిశీలన

ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి ఉధృతి, పునరావాస ఏర్పాట్లను కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. నదీ పరీవాహక ప్రాంతంలోని లంకవాసులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే పునరావాస కేంద్రాలకు తీసుకురావాలని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు లేకపోయినా, గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల వరద ముంపు పొంచి ఉందన్నారు. పరిస్థితి యథాస్థితికి వచ్చేవరకు లంక, లోతట్టు గ్రామాల వాసులు పునరావాస కేంద్రాలకు, సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కలెక్టర్ కోరారు. పునరావాస కేంద్రాల్లో వసతి ఏర్పాటుతో పాటు అల్పాహారం, టీ, భోజన సౌకర్యం, వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



పెనుగొండ మండలం సిద్ధాంతంలో గోదావరి వరద నీటిలో కేదారీఘాట్



తణుకు మండలం ముద్దాపురంలో నీట మునిగిన పంట పొలాలు



తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాల్వకు గండి



ఉండి అక్విడెక్టు వద్ద వరద నీటి విడుదలతో నీట మునిగిన ఇళ్లు



యలమంచిలి మండలం కనకాయలంక వద్ద కాజ్‌వే మునిగిపోవడంతో పడవలపై ప్రయాణం

జగనన్న ఆశయాల మేరకు సాగాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలంతా ముందుకు సాగాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పిలుపునిచ్చారు. తూర్పుపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆచంట, పోడూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, ఏ కష్టమొచ్చినా అండగా నిలబడతానని, ఎవరూ అధైర్యపడవద్దని చెప్పారు. పార్టీ అధికారంలో లేకపోయినా పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల అభివృద్ధికి సహకరించడంతో పాటు ప్రజల సమస్యలను, గ్రామాల్లో ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో పార్టీ అధికారంలోకి రాకముందు ఏ ఉత్సాహంతో పనిచేశారో ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చే కార్యక్రమాలన్నింటినీ గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్‌వర్మ, జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పోడూరు, ఆచంట మండలాల కన్వీనర్‌లు పిల్లి నాగన్న, జక్కంశెట్టి చంటి, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుబ్బల ఉషారాణి బ్రహ్మం, సుంకర సీతారాం తదితరులు పాల్గొన్నారు.

27 వరకూ ఆధార్ క్యాంపులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఈ నెల 23 నుంచి 27 వరకు ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేశామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయలు, పాఠశాలలు, కాలేజీల్లో ఆధార్ అప్డేట్ మొబైల్ క్యాంపుల ద్వారా పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీసులను అప్‌డేట్ చేస్తామన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో జూలై 23 నుంచి ఎంపిక చేసిన నాలుగు ప్రాంతాలలో ఆధార్ అప్‌డేట్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

ఓట్లేసిన ప్రజలను కించపరుస్తారా?

బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుపై మేకా శేషుబాబు ఆగ్రహం



పాలకొల్లు అర్బన్: వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసిన ప్రజలను కించపరుస్తూ అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చేసిన వ్యాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పాలకొల్లులో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ‘వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసిన 40 శాతం మంది అన్నం తింటున్నారా.. గడ్డి తింటున్నారా అంటూ వ్యాఖ్యలు చేయడంపై శేషుబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలు పెత్తందారీ పోకడలకు నిదర్శనమని పేర్కొన్నారు. అహంకారంతో, అహంభావంతో చేసిన వ్యాఖ్యలుగా అభివర్ణించారు. రాజ్యాంగంలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా తమకిష్టమైన వ్యక్తులకు, పార్టీలకు ఓటు వేసే హక్కు ఉందని తెలిపారు. విష్ణుకుమార్‌రాజు చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 40 శాతం ప్రజలకు కూడా విష్ణుకుమార్‌రాజు క్షమాపణ చెప్పి తీరాలని కోరారు.

పిల్లల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): పిల్లల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి చైల్డ్ వెల్ఫేర్ కమిటీని ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని బాలల సంరక్షణకు కృషి చేయాలన్నారు. వీధి బాలలు, బడికి బయట చిన్నారులు, బాల కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించిన బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించి చదువుకునేలా శ్రద్ధ వహించాలన్నారు. మిషన్ వాత్సల్య పథకం కింద నిధులు చిన్నారుల ఖాతాల్లో జమ చేసేందుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. స్పాన్సర్‌షిప్ కార్యక్రమం మంజూరుకు నిరుపేదలు, నిస్సహాయ స్థితిలో వున్న 18 ఏళ్ల లోపు వయసు వారు అర్హులన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సైబర్ నేరాలపై అవగాహన బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: సైబర్ నేరాల పట్ల అన్నివర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాలు, ప్రజలు పోలీసులకు సవాలుగా మారయని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సైబర్ నేరాల అప్రమత్తత ప్రచారభేరి బ్రోచర్‌ను మంగళవారం ఎస్పీ ఆవి ష్కరించి మాట్లాడారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు చేస్తే తక్షణం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలను చైతన్యవంతం చేయడానికి శ్రీవిజ్ఞానవేదిక అవగాహన చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, ట్రాఫిక్ సీఐ దాస్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ డీఈపై సస్పెన్షన్ వేటు

భీమవరం: విధి నిర్వహణలో అలసత్వం వహించిన డ్రైనేజీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంవీవీ కిషోర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పాలకోడేరు మండలం మోగల్లు వద్ద గోస్తని డ్రైయిన్‌కు గండి పడడానికి డ్రైనేజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ పర్యవేక్షణ లోపంతో పాటు సరైన ముందస్తు చర్యలు తీసుకోపోవడంతో కలెక్టర్ సస్పెన్షన్ వేటువేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిసింది.

క్లుప్తంగా

వ్యవసాయం, విద్యకు మొండిచేయి


మాట్లాడుతున్న సీపీఐ నేత భీమారావు

ఉండి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్య, వ్యవసాయం రంగాలకు కేవలం 3 శాతం మాత్రమే నిధులు కేటాయించడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. మంగళవారం ఉండిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రైతన్న ఆత్మహత్యల నివారణకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు ఊసేలేదన్నారు. పంటలకు కనీస మద్దతు ధర కోసం నిర్దిష్ట హామీ లేదన్నారు. వ్యవసాయ రంగానికి 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 3 శాతం కేటాయించడం సరికాదన్నారు. నిత్యావసరాల ధరల నియంత్రణ, వ్యవసాయ కార్మికులు అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. గంగానది ప్రక్షాళనకు రూ.26 వేల కోట్లు కేటాయించిన కేంద్రం రాష్ట్ర రాజధానికి కేవలం రూ.15 వేల కోట్లు కేటాయిస్తే ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. 2 కోట్ల ఉద్యోగాలిస్తానని అధికారంలోకి వచ్చిన మోదీ ఇప్పుడు కోటి ఉద్యోగాల కల్పన అని పేర్కొనడం యువతను మరోసారి మోసగించడమేనన్నారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉండిలో సీపీఐ బృందం పర్యటించి ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు స్వాధీనం

జంగారెడ్డిగూడెం రూరల్: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీను దేవులపల్లిలో స్వాధీనం చేసుకున్నట్లు లక్కవరం ఎస్సై సుధీర్ చెప్పారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇసుక తరలిస్తున్నారని సీఐ రాజేష్‌కు అందిన సమాచారంతో మంగళవారం దేవులపల్లి సెంటర్‌లో ఎస్సై సుధీర్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. వాడపల్లి ర్యాంప్‌లో ఇసుకను లోడ్ చేసి ఒక లారీ గోపాలపురం మండలం రేగులకుంట, మరో లారీ తాళ్లపూడి మండలం కొవ్వూరుపాడు గ్రామానికి తరలించేందుకు డెస్టినేషన్ అడ్రస్‌లు కలిగిన వేబిల్లులు ఉన్నాయి. అయితే లారీలకు చెందిన వ్యక్తులు అక్రమంగా లాభాలు పొందేందుకు డెస్టినేషన్ అడ్రస్‌కి వెళ్లకుండా రూట్ డైవర్షన్ చేసి చింతలపూడి వెళుతుండగా లారీలను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


స్వామి మృతదేహం

ఆగిరిపల్లి: పొట్టకూటి కోసం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలోని చిన నందిగామ గ్రామానికి చెందిన బలుసు స్వామి (63)తో పాటు 15 మంది మత్స్యకారులు మంగళవారం ఉదయం చేపల పట్టుబడి కోసం శోభనాపురంలోని కంబాల చెరువులోకి చేపల వలతో దిగారు. స్వామి చేపలు పట్టడానికి వల విసరగా ప్రమాదవశాత్తు అది తన కాళ్లకు చిక్కుకుని నీటిలో మునిగిపోయాడు. సహచరులు గుర్తించి అతనిని బయటికి తీయగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు తరలించారు. ఎస్సై సురేంద్ర కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రగంగతో వ్యథ తీరేనా?

- రైతుల పాలిట దుఃఖదాయినిగా ఎర్రకాలువ
- నాట్లు, కోతల సమయంలో తప్పని ముంపు సమస్య
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రతి ఏటా నష్టపోతున్న రైతులు
- 4 వేల ఎకరాలు, 20 గ్రామాలపై ముంపు ప్రభావం
- అసంపూర్తిగా కాలువ విస్తరణ, గట్ల పటిష్టం పనులు

ఎర్రకాలువ రైతుల పాలిట దుఃఖదాయినిగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఏటా వరి నాట్లు, పంట కోత సమయంలోనో వరద రూపంలో కృషీవలులకు కన్నీళ్లను మిగులుస్తోంది. కాలువ విస్తరణ, గట్ల పటిష్టం కోసం దశాబ్దం క్రితం పనులు చేపట్టినా ఇప్పటికీ కొలిక్కిరాలేదు. అరకొర పనులు, అధికారుల అలసత్వం వల్ల వర్షాకాలంలో ఎర్రకాలువ ఉప్పొంగి 20 గ్రామాలను, నాలుగు వేల ఎకరాలను ముంచెత్తుతూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కొత్త ప్రభుత్వం స్పందించి కాలువ పనులు పూర్తి చేస్తే సుమారు 10 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు స్థిరీకరణ జరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.


తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో ఎర్రకాలువ వరద వల్ల మునిగిన చేలు

తాడేపల్లిగూడెం: ఎగువ నుంచి కురిసిన వర్షాలు, కొండవాగుల నుంచి మెట్ట ప్రాంతంలోని కొంగువారిగూడెం రిజర్వాయర్‌లోకి చేరిన నీరు అక్కడి నుంచి పరవళ్లు తొక్కుతూ సుడులు తిరుగుతూ కదులుతూ పులివాగు, బైనేరు వంటి వాగులను కలుపుకుంటూ డెల్టా వైపు ఎర్రకాలువలో ప్రవాహం పరుగులు తీస్తుంది. ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద నుంచి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్ మండలం నందమూరు వరకు ఈ కాలువ ఉంది. కాలువ పరిధిలో చెక్‌డ్యామ్‌ల పునర్నిర్మాణం, అవసరమైన చోట్ల కాలువల విస్తరణ పనులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జరిగాయి. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకొనేలోగా వైఎస్ అమరుడయ్యారు. దీంతో ఆ పనుల్లో ప్రతిష్టంభన వచ్చింది. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో అప్పటి కేంద్ర మంత్రి హోదాలో చిరంజీవి రూ.123 కోట్ల వ్యయంతో 2013 ఏప్రిల్ 7న నల్లజర్ల మండలం అనంతపల్లి నుంచి నందమూరు ఆక్విడెక్ట్ వరకు విస్తరణ పనులకు మాధవరం వద్ద శంకుస్థాపన చేశారు. ఈ పనులలో భాగంగా ఎర్రకాలువను విస్తరించడంతో పాటు గట్లను పటిష్టం చేయాలి. భూసేకరణ తగాదా తేలకపోవడంతో కొంతకాలం ఈ పనులు ముందుకు సాగలేదు. త్యాజంపూడి, గుండేపల్లి, వీరంపాలెం ప్రాంతాలలో భూసేకరణ తగాదా చాలాకాలం కొలిక్కిరాలేదు.

ఐదు రీచ్‌లుగా పనుల విభజన

నల్లజర్ల మండలం అనంతపల్లి నుంచి నందమూరు ఆక్విడెక్టు వద్ద 33.370 కిలోమీటర్ల మేర ఎర్రకాలువ విస్తరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని అధికారులు అప్పట్లో ప్రతిపాదనలు చేశారు. ఈ పనులను ఐదు రీచ్‌లుగా విభజించారు. అనంతరం నిర్దేశించిన విధంగా పనులు ముందుకు సాగకపోవడం, మెటీరియల్ ధరలు పెరగడం తదితర కారణాల నేపథ్యంలో ప్రత్యేక జీఓ ద్వారా ప్రభుత్వం విస్తరణ పనులకు అదనంగా నిధులు పెంచింది. రూ.121.83 కోట్లుగా నిర్ణయించిన ఈ పనుల వ్యయాన్ని రూ.143.15 కోట్లకు పెంచారు. అయ్యినా పనులు ముందుకు సాగలేదు.

55 శాతం మాత్రమే పూర్తి

ఎర్రకాల్వ విస్తరణ పనులు 55 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇన్‌లెట్స్, ఆఫ్‌టెక్ స్లూయిస్ (ఓటీ) (తూములు), క్యాటిట్ ర్యాంప్స్ (సీఆర్) పశువులు నీరు తాగడానికి ర్యాంపుల ఏర్పాటు, గ్రావెల్ రోడ్లు, గట్ల పటిష్టత పనులను చేయాల్సి ఉంది. జగన్నాథపురం నుంచి నందమూరు వరకు ఈ పనులు అసంపూర్తిగా జరిగాయి. అప్పారావుపేట – కోరుమామిడి వంతెన సమీపంలో చినబాపన్నకోడు, పెదబాపన్నకోడు చెక్‌డ్యామ్‌లు, రామరాజు గట్టు పటిష్ట పర్చాల్సి ఉంది. బాపన్నకోడు నుంచి ముష్టికోడు కాలువ తదితర కాలువలను విస్తరించాల్సి ఉంది.

పనులు పూర్తయితే..

కాలువ విస్తరణ పనులు పూర్తయ్యితే పదివేల ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం ఉంటుంది. చెరువులు ఆక్రమణలో ఉండటం, వాటి కింద బోదెలను పూడ్చివేయడంతో వర్షాకాలంలో నీరు కిందకు లాగక పంట చేలు ముంపునకు గురయ్యేవి. గండ్లు పూడ్చడం, గట్ల పటిష్టం వంటి పనులు పూర్తయ్యితే 20,250 క్యూసెక్కుల నీరు ఈ కాలువ గుండా వెళ్లే వీలుంది. ఇవి పూర్తికాని కారణంగా అనంతపల్లి నుంచి నందమూరు వరకు ఎర్రకాల్వ వరదలో ఏటా 20 గ్రామాలు, నాలుగువేల ఎకరాలు చిక్కుకుంటున్నాయి. ఈ నెలలో అధికంగా కురిసిన వానలు, తద్వారా వచ్చిన ఎర్రకాల్వ ముంపు కారణంగా చేలు మునిగి నీరు గ్రామాలను చుట్టుముట్టింది. కొన్ని చోట్ల గండ్లు పడ్డాయి.

పనులు పూర్తిచేస్తేనే మోక్షం

నల్లజర్ల మండలం అనంతపల్లి నుంచి తాడేపల్లిగూడెం మండలం వరకు ఎర్రకాల్వ పరీవాహక ప్రాంతంలో గండ్లు పూడ్చి, గట్లను పటిష్టం చేయాల్సి ఉంది. సబ్‌చానల్స్, రామరాజుగట్టు, బాపన్నకోడు వంటి చెక్ డ్యామ్‌లను పూర్తిస్థాయిలో పునఃనిర్మాణం చేపడితేనే గ్రామాలను, పంట చేలను ఎర్రకాలువ ముంపు బారిన పడకుండా కాపాడుకోవచ్చని రైతులు చెబుతున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. తాడువాయి గ్రామానికి చెందిన బాలిక జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈ నెల 22న కళాశాలకు సెలవు కావడంతో ఇంటి వద్దే ఉంది. తల్లి పని నిమిత్తం జంగారెడ్డిగూడెం వచ్చి తిరిగి రాత్రి 7.30 గంటలకు ఇంటికి వెళ్లగా, ఇంటి తలుపులకు తాళం వేసి పక్కనే మేకుకు తగిలించి ఉండటాన్ని గమనించి, లోపలికి వెళ్లి చూసింది. బీరువాలోని బాలిక దుస్తులతోపాటు నగదు కనిపించలేదు. దీంతో బాలిక ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక అదృశ్యం కావడానికి గ్రామానికి చెందిన కలపాల మురళీ అనే యువకుడిపై అనుమానం ఉన్నట్లు తల్లి ఫిర్యాదులో పేర్కొన్నట్లు హెచ్‌సీ తెలిపారు.

నిప్పంటించుకుని వివాహిత ఆత్మహత్య

పెంటపాడు: ప్రత్తిపాడులో ఒక వివాహిత తన శరీరంపై టిన్నర్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న గునా కరుణకుమారి (28) మంగళవారం వంటిపై పెయింట్‌లకు ఉపయోగించే టిన్నర్ పోసుకుని నిప్పంటించుకుంది. ఈ ఘటనలో శరీరం కాలి అక్కడికక్కడే మృతి చెందింది. కాగా ఆమె ఆత్మహత్యకు సంబంధించి కారణాలు తెలియరాలేదు. ఈమెకు భర్త పండుతో పాటు, ఇద్దరు సంతానం ఉన్నారు. పండు వెల్డింగ్ పని చేస్తున్నారు. సమాచారం అందుకున్న గూడెం రూరల్ సీఐ రమేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిట్ట కొంచెం.. కూత ఘనం


తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రంతో లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పిట్ట కొంచెం... కూత ఘనం అన్నట్లుగా అతి చిన్న వయసులోనే రికార్డులను సాధిస్తూ అబ్బురపరుస్తోంది చిన్నారి. తన పేరిట రెండు వరల్డ్ రికార్డులు, రెండు జాతీయ రికార్డులు నమోదు చేసి ఔరా అనిపించింది. వివరాల్లోకి వెళితే.. జంగారెడ్డిగూడెంకు చెందిన గరిమెళ్ల కార్తిక్, గాయత్రి దంపతుల 2 ఏళ్ల చిన్నారి గరిమెళ్ల లక్ష్మీ వర్ణిక వివిధ అంశాల్లో తన ప్రతిభను చాటింది. తల్లితండ్రులు, అమ్మమ్మ, తాతయ్యలు ప్రసన్న, నాగమందేశ్వర శర్మ ప్రోత్సాహంతో అతి చిన్న వయసులోనే మూడు వేలకు పైగా వస్తువులను గుర్తించడం, 13 అడుగుల నిచ్చెనను ఎవరి సహాయం లేకుండా 25 సెకండ్లలో ఎక్కడం, యోగాసనాలు వేయడం, శ్లోకాలు చెప్పడం తదితర అంశాల్లో తన విశేష ప్రతిభ కనబర్చింది. లక్ష్మీ వర్ణిక అద్భుత ప్రదర్శనలతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్ బుక్, ఇంటర్‌నేషనల్ వర్ల్స్ రికార్డ్స్ స్థానం సాధించింది. ఈ మేరకు ఆయా సంస్థలు లక్ష్మీ వర్ణిక ప్రతిభను గుర్తిస్తూ ధ్రువీకరణపత్రాలు సైతం అందించారు.

వరద ప్రాంతాల్లో పశువైద్య సేవలు


మేడేపల్లిలో పశువుకు టీకా వేస్తున్న వైద్య శిబ్బంది

ఏలూరు (టూటౌన్): కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.నెహ్రూబాబు చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పశువైద్య సేవల్లో భాగంగా గత నాలుగు రోజుల్లో ఇప్పటివరకు వేలేరుపాడు మండలం మేడేపల్లి, కోయమాదారం, రామవరం, ఉదయనగర్, గుండ్లవై, కుక్కనూరు మండలం ఇసుకపాడు, గొమ్ముగూగెం, ఉప్పరమద్దిగట్ల, లచ్చిగూడెం, కొండిన్యముక్తి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించి 121 ఆవులు, 51 గేదెలు, 132 మేకలు, 35 గొర్రెలు కలిపి మొత్తం 339 పశువులకు వైద్య సేవలు అందించామన్నారు. అదేవిధంగా మినరల్ మిక్చర్ 339 కేజీలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు కింద హెచ్‌ఎస్‌–913 డోసులు, ఐటీ–1046 డోసులు వేశామని జేడీ వివరించారు.

పోక్సో కేసు నమోదు

ఉండి: మండలంలోని ఓ గ్రామంలో ఏడేళ్ల బాలికపై ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించడంపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం బాలిక తలిదండ్రులు గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుని వద్దకు చికిత్స కోసం వెళుతూ ఇంటి పక్కనే ఉండే యువకుడికి తమ ఏడేళ్ల కుమార్తెను అప్పగించి చూస్తుండమని చెప్పారు. అయితే బాలిక తల్లిదండ్రులు వెళ్లిన అనంతరం యువకుడు బాలికతో తీవ్ర అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక ఏడ్చుకుంటూ వెళ్లి తమ తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై ఎం.లక్ష్మణ్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి మొండిచేయి

జంగారెడ్డిగూడెం: బడ్జెట్లో రాష్ట్రానికి మరోసారి కేంద్రం మొండి చేయి చూపించిందని సీపీఐ, ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ విమర్శించారు. నిర్మల సీతారామన్ కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. రాష్ట్రానికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా బీహార్‌కు రోడ్లకు భారీగా నిధులు కేటాయించారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు, ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని బడ్జెట్లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. అమ్మోనియం నైట్రేట్ వాటిపై 10 నుంచి 15 శాతం పన్నులు పెంచడం ద్వారా ఎరువులు, పురుగు మందుల రేట్లు విపరీతంగా పెరుగుతాయని విమర్శించారు. ఇది మొత్తం ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు.

రైలు ఢీకొని బిహార్ వాసి మృతి


వినోద్ బహర్దార్ మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా కలపర్రు రైల్వేగేటు సమీపంలో రైలు ఢీకొని బిహార్‌కు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన వినోద్ బహర్దార్ (39) అదే ప్రాంతానికి చెందిన పరమానంద బహర్దార్ అనే మరో వ్యక్తితో కలిసి పనులు చేసుకునేందుకు వారి స్వగ్రామం కృష్ణగంజ్ నుంచి బెంగళూరు బయలుదేరారు. ఎస్ఎంవీటీ బెంగళూరు సూపర్ ఫాస్ట్ రైలులో వీరిద్దరూ ప్రయాణం చేస్తున్నారు. మార్గమధ్యంలో కలపర్రు రైల్వే గేటు సమీపంలో చైన్‌పుల్ కావటంతో 22వ తేదీ రాత్రి 11 గంటలకు రైలు కొంతసేపు నిలిచిపోయింది. రైలు ఆగటంతో ఇద్దరూ రైలుదిగి మూత్రవిసర్జనకు అవలివైపునకు వెళ్లారు. మూత్రవిసర్జన అనంతరం తాము ప్రయాణించే రైలు ఎక్కేందుకు రైలుపట్టాలు దాటుతూ ఉండగా అటువైపు నుంచి వచ్చిన దురంతో సూపర్‌ఫాస్ట్ రైలు వినోద్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. రైల్వే ఎస్సై సైమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాతలకు ఇంత అవమానమా?

- శ్రీరామవరంలో ఆర్‌బీకే, సచివాలయాలకు స్థలాల దానం
- దాతల సేవలకు గుర్తింపుగా సత్కరించిన అప్పటి కలెక్టర్, ఎస్పీ
- కొత్త ప్రభుత్వం రాగానే దాతల పేర్ల బోర్డులు, శిలాఫలకాల ధ్వంసం
- ఇంత అవమానమా అంటూ ప్రశ్నిస్తున్న దాతలు



స్థలదాతను సత్కరిస్తున్న అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ (ఫైల్)

దెందులూరు: గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యులైన దాతల సేవలను గుర్తించి గత వైఎస్ జగన్ సర్కారు ఎంతో గౌరవించి సత్కరించింది. అయితే ఇటీవల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే అక్కసుతో కొందరు దాతల సహకారంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలపై దాతల పేర్లను, వారి పేర్లు ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేయడంపై వారిలో ఆవేదన వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే.. శ్రీరామవరంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రానికి గ్రామానికి చెందిన దాత కామిరెడ్డి పట్టాభిరామయ్య, అమ్మాజీ పేరిట వారి కుమారులు కామిరెడ్డి గాంధీ, కామిరెడ్డి రాజేంద్రప్రసాద్, కామిరెడ్డి నాగభూషణం, కుమార్తె పుష్పలీలావతి స్థలం దానం చేశారు. గత ప్రభుత్వం ఆ స్థలంలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలను నిర్మించింది. రెండు భవనాలపై దాతల పేర్లను ఏర్పాటు చేశారు. వారి సేవలకు గుర్తింపుగా అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, జాయింట్ కలెక్టర్ అరుణ్‌కుమార్ గణతంత్ర వేడుకల్లో దాతలను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 40 రోజుల్లోపే దాత దాతృత్వాన్ని, ఔదార్యాన్ని గౌరవించకుండా గ్రామ సచివాలయంలోపై ఉన్న వారి పేరును పూర్తిగా తొలగించారు. అలాగే రైతు భరోసా కేంద్రం భవనంపై ఉన్న పేర్లలో అక్షరాలను కొన్నింటిని, శిలాఫలకాలు ధ్వంసం చేశారు. దీనిపై మంగళవారం శ్రీరామవరంలో దాత కుటుంబసభ్యులు మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల పేరిట స్థలం దానం చేశామని దాతల పేర్లు భవనాలపై తొలగించడం దారుణమన్నారు. తాము గ్రామాభివృద్ధి కోసం స్థలం దానం చేయడం తప్పా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దాతలను అవమానపరిచేలా అవహేళన చేశారని వాపోయారు. గతంలో ఎప్పుడూ ఈ తరహా దారుణాలు చేయలేదని, ప్రభుత్వ భవనాలపై ఉన్న తమ తల్లిదండ్రుల పేర్లు తొలగించడం సరికాదన్నారు. ఈ సంఘటనపై న్యాయం కోసం పోరాడతామని దాత కుమారులు కామిరెడ్డి గాంధీ, కామిరెడ్డి రాజేంద్రప్రసాద్, కామిరెడ్డి నాగభూషణం చెప్పారు.


శ్రీరామవరంలో గ్రామ సచివాలయ భవనంపై దాతల పేర్లు తొలగించిన దృశ్యం (ఫైల్)


ఆర్‌బీకే భవనంపై ఉన్న పేర్లను తొలగించిన దృశ్యం (ఫైల్)

నడి గోదావరిలో.. బిక్కుబిక్కుమంటూ..


గోదావరి మధ్యలో ఉన్న తూర్పుమెట్ట గ్రామం


గుట్ట కింది భాగంలో నీటమునిగిన పాఠశాల భవనం

- ఏటా గోదావరి జలదిగ్బంధంలో తూర్పుమెట్ట
- నేడు చుట్టూ వరదనీటితో క్షణక్షణం భయంభయంగా గ్రామస్తులు
- ప్రభుత్వం నుంచి కానరాని సహాయక చర్యలు
- మంచినీరు లేక బురద నీటిని తాగి అవస్థలు పడుతున్న గిరిజనులు
- వ్యాధుల బారిన 10 మంది గిరిజనులు
- వైద్యం, సాయం కోసం ఎదురుచూపులు

వేలేరుపాడు: గోదావరికి వరద పోటెత్తిన ప్రతిసారి మండలంలోని తూర్పుమెట్ట గ్రామాన్ని చుట్టిముడుతుంది. ఆ సందర్భంలో గ్రామంలోని ఏడెనిమిది ఇళ్లు నీట మునుగుతుంటాయి. అయితే ఏనాడూ ఏ అధికారి కూడా ఈ గ్రామాన్ని సందర్శించడం కాని, సహాయక చర్యలు చేపట్టడం గానీ జరగలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం గోదావరి వరద సంభవించడంతో తూర్పుమెట్ట గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఈ గ్రామంలో మొత్తం 110 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. గత ఐదు రోజులుగా వరద ఉధృతి తగ్గకపోవడంతో ఈ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కనీసం తాగేందుకు మంచినీరు కూడా దొరకకపోవడంతో వరద నీరే గ్రామస్తులకు దిక్కైంది. దీంతో ఈ నీటిని తాగిన పదిమంది గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారు. వీరికి వైద్యసేవలందించే వారే కరువయ్యారు. ఈ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదు. ఈ గ్రామ గిరిజనులకు కూరగాయలు, బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేయలేదు. వంట చేసుకోవడానికి బియ్యం లేక అనేక కుటుంబాలు పస్తులుండాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా లేక, కొవ్వొత్తులు సైతం అందుబాటులో అంధకారంలో మగ్గుతున్నారు. నడిగోదావరిలో ఈ గ్రామం ఉండటంలో ఇతర గ్రామానికి రావాలంటే గోదావరిలో బోటు ప్రయాణమే శరణ్యం. గత ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో విద్యుత్ జనరేటర్ ఏర్పాటు చేసి బోటు అందుబాటులో ఉంచారు.

గుక్కెడు నీళ్లకూ దిక్కులేదు



తాగడానికి గుక్కెడు నీళ్లు లేవు. కనీసం ఒక్క మంచినీటి ప్యాకెట్ కూడా పంపిణీ చేయలేదు. ఏ అధికారులు మా గ్రామం వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. గత ప్రభుత్వంలో మా గ్రామంలో అధికారులు బోట్ కూడా ఏర్పాటు చేశారు.

– కౌలూరి రాజేష్ తూర్పుమెట్ట

కొవ్వొత్తులు కూడా లేవు



గత ఐదు రోజులుగా కరెంటు లేదు. చీకట్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాం. ప్రభుత్వం కొవ్వొత్తులు కూడా సరఫరా చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో మా గ్రామంలో విద్యుత్ జనరేటర్ ఏర్పాటు చేశారు.

– చిచ్చడి దుర్గయ్య తూర్పుమెట్ట గ్రామం

క్లుప్తంగా

వరద బాధితులకు భోజన ఏర్పాట్లు



వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న సర్పంచ్ చంద్రిక, నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు, జగన్నాథపురం, మారంపల్లి తదితర గ్రామాల్లో ఎర్ర కాలువ వరద బాధితులకు మంగళవారం భోజన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆరుళ్ల గ్రామంలో గ్రామ రైస్ మిల్లర్స్ చలంచర్ల వెంకన్నబాబు సహకారంతో భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, సచివాలయం–2 సెక్రటరీ ఫణికుమార్, వీఆర్వో, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉండ్రాజవరపు రాజు, కూటమి నాయకులు పుల్లా అన్నవరం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ డ్రైడే పాటించాలి



తణుకులో రుబ్బురోలులో ఉన్న నీటిని తొలగింపజేస్తున్న వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఎన్జీవో కాలనీలో మంగళవారం మస్కిటో లార్వా డెన్సిటీ, వెక్టార్ కంట్రోల్ హైజీన్, డెంగ్యూ ప్రివెన్షన్, స్టాప్ ది డయారియా, లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టే క్రమంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని సూచించారు. అతిసార వ్యాధి రాకుండా చేతులు పరిశుభ్రతతోపాటు కాచి చల్లార్చిన నీటి తాగాలని, స్పర్శలేని రాగి మచ్చలు వస్తే వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.పృథ్వీరాజ్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జీవీఎస్ఎన్ మూర్తి, హెల్త్ సెక్రటరీ ఎం.పద్మావతి, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

మానవత విశాఖ సెంట్రల్ కమిటీ డైరెక్టర్‌గా రాధాపుష్పావతి



డా.కే రాధాపుష్పావతి

తణుకు టౌన్: మానవత సంస్థ ఉమ్మడి విశాఖపట్టణం జిల్లా సెంట్రల్ కమిటీ డైరెక్టర్‌గా తణుకు పట్టణానికి చెందిన డాక్టర్ కే రాధాపుష్పావతిని నియమించారు. ఆమె మంగళవారం ఈ విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేరీర్ గైడెన్స్ సెల్ కమిటీ చైర్మన్‌గా, రాష్ట్రవిస్తరణ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎల్ఎల్ఎం సేవలు అభినందనీయం



ముంపు బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: నిరాశ్రయులైన కుటుంబాలకు ఎల్ఎల్ఎం ఎప్పుడూ అండగా ఉంటుందని యుపీఏ పాస్టర్‌సంఘ అధ్యక్షుడు, ఎల్ఎల్ఎం చర్చి సంఘ కాపరి మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. ఇటీవల తుఫానులో సర్వం కోల్పోయి, పునరావాస కేంద్రంలో ఉంటున్న 50 కుటుంబాలకు రూ.20వేల విలువైన నిత్యాసర వస్తువులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గొర్రెల శ్రీధర్, జనసేన నాయకులు బొలిశెట్టి రాజేష్, వర్తనపల్లి కాశీ, యుపీఎఫ్ ఎన్. అబ్రహం, డేవిడ్ లివింగ్‌స్టన్, శిరపరపు శాంతి రాజు, యుపీఎఫ్, ఎల్ఎల్ఎం చర్చిసంఘ దైవ సేవకులు సువర్ణరాజు, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయరాదు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీకాంతం

వీరవాసరం: మహిళల పురోభివృద్ధికి సమాజంలోని ప్రతిఒక్కరూ ప్రత్యేక కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీకే లక్ష్మీకాంతం తెలిపారు. వీరవాసరం మండలం మత్స్యపురి జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకొని, వాటిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మహిళలు బాలికలపై జరిగే మహిళ వేధింపులకు ప్రతిఒక్కరూ తక్షణం స్పందించి టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలకు బ్యాడ్‌టచ్ గుడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న వరద ఉధృతి



దువ్వలో పంట పొలాల్లో ప్రవహిస్తున్న వరద నీరు



తేతలి కాలవ గట్లపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

- ముంపులో పంటచేలు..కుళ్లిన వరినాట్లు
- ఆందోళన చెందుతున్న రైతులు
- విష సర్పాలతో భయపడుతున్న స్థానిక ప్రజలు

తణుకు టౌన్: వయ్యేరు వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. మంగళవారం తణుకు మండలం కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి గ్రామాల్లోని వరి పంట పొలాలు ఎర్ర కాలువ వరద నీరు వరద ముంపుకు గురువుతూనే ఉన్నాయి. మంగళవారం ఎర్ర కాలువ వరద కారణంగా కోనాల–ఆరుళ్ల ఆర్ అండ్ బీ రోడ్డు పై వరద నీరు ప్రవాహం పెరగడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దువ్వ సూర్యరావుపాలెం రోడ్డు కూడా వరద నీటిలో మునిగిపోవడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు గత రెండు రోజులుగా నిలిచిపోయాయి. దువ్వ అక్విడెక్ట్ వద్ద నీటి మట్టం తగ్గుతుంది. కానీ వరద మాత్రం తేతలి గ్రామంలోని చాలా వరకు పొంట పొలాలు వరద నీటిలోనే ఉన్నాయి.

తిరుపతిపురంలో ఇళ్లలోకి చేరిన వరదనీరు

అత్తిలి: ఇటీవల కురిసిన వర్షాలకు రోజుల తరబడి వరినాట్లు ముంపులో ఉండి కుళ్లిపోవడంతో రైతాంగం దిగాలు చెందుతున్నారు. అత్తిలి మండలంలో 14,500 ఎకరాలలో సార్వా సాగు చేపట్టగా, 40 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. కురిసిన వర్షాలకు మండలంలోగల రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు డ్రెయిన్‌లు పొంగి ప్రవహించడంతో సుమారు 3వేల ఎకరాల్లో వరినాట్లు ముంపులో ఉన్నాయి. రోజులు గడుస్తున్నా చేలల్లోకి వరదనీరు ముంచెత్తడంతో వరినాట్లు, నారుమడులు కుళ్లిపోయాయి. తిరుపతిపురం గ్రామంలో వరదనీరు ఇళ్లల్లోకి చేరింది. అత్తిలి మండలం తిరుపతిపురం, వరిఘేడు, బల్లిపాడు, కొమ్మర, ఈడూరు, స్కిన్నెరపురం, లక్ష్మీనారాయణపురం, మంచిలి ప్రాంతాల్లో ముంపులోనే వరినాట్లు, నారుమడులు ఉన్నాయి. యనమదుర్రు డ్రెయిన్ ఉధృతి తగ్గితేనే మండలంలోగల ప్రధాన డ్రెయిన్‌ల ద్వారా చేలల్లో వర్షంనీరు బయటకు వెళుతుంది. ప్రతీ ఏడాది యనమదుర్రు డ్రెయిన్ ఉధృతికి తమ పంటలు పాడౌతున్నాయని, వేలాది రూపాయలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదముంపు వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



అత్తిలి మండలం తిరుపతిపురంలో గ్రామంలోకి వచ్చిన వరదనీరు



అత్తిలి మండలం వరిఘేడులో రోడ్డుపైకి చేరిన వరదనీరు



అత్తిలి మండలం తిరుపతిపురంలో నీట ముంపులో వరినాట్లు

కార్మిక వ్యతిరేక బడ్జెట్‌గా నిలిచింది

తణుకు: అభివృద్ధి, ఉపాధికి ఎలాంటి తోడ్పాటు లేని బడ్జెట్‌గా కేంద్ర బడ్జెట్ ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ఎద్దేవా చేశారు. వికసిత భారత్ ఈ బడ్జెట్ తోడ్పడుతుందని ముందుగానే పెద్దెత్తున ప్రచారం చేసినప్పటికీ తీరా బడ్జెట్ తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విద్య, వైద్యంపై ఖర్చు పెంచలేదని పైగా జీడీపీలో ఆరోగ్యానికి కనీసంగా 2.5 శాతం కేటాయింపులు ఉండాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, కనీస వేతనాలు, ఇతర సమస్యలపై కార్మిక సంఘాలు ఆర్థిక మంత్రికి ముందుగా సమర్పించిన కోరికల పత్రంపై ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను తిరస్కరించాలని ఆయన కోరారు.

జగన్నాథపురం రహదారుల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు



జగన్నాథపురం గ్రామంలో రహదారులను పరిశీలిస్తున్న సర్పంచ్ చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.40లక్షలు మంజూరు చేశారు. దీంతో గ్రామంలో ఏయే రహదారులను నిర్మించాలనే దానిపై మంగళవారం కూటమి నాయకులు, అధికారులతో కలిసి గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక పరిశీలించారు. పీఆర్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్ తదితరులు ఉన్నారు.

వీడని యనమదుర్రు ముంపు

ఐదు రోజులుగా నీటిలోనే వరిపంటలు



కొండేపాడు, మీనవిల్లూరు గ్రామాల వద్ద పొంగి ప్రవహిస్తున్న యనమదుర్రు

పెంటపాడు: యనమదుర్రు ముంపు ఇంకా మండలాన్ని వీడలేదు. ఎగువ నుంచి వచ్చిన భారీ వరద రోడ్లపై, పంటలపై పరవళ్లు తొక్కుతోంది. గత వారం రోజులు నుంచి వర్షం నీరు చేలలో అలానే ఉండి పోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీటివల్ల డ్రెయిన్‌లు, కాలువలు ఉప్పొంగుతున్నాయి. ప్రధానంగా కొండేపాడు, మీనవిల్లూరు, యానాలపల్లి, కె. పెంటపాడు, పరిమెళ్ల గ్రామాల్లో ముంపు అధికంగా ఉంది. మంగళవారం పెంటపాడు మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి పలు గ్రామాలు పర్యటించారు. ముంపుకు గురైన వరి పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు అందజేశారు.

పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకుల పంపిణీ



తణుకులో బ్రాహ్మణులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తున్న నాయకులు

తణుకు అర్బన్: గ్రీన్ ఏషియా ఇంపెక్స్ సంస్థ అధినేత, బీజేపీ రాష్ట్ర నాయకులు పసుపులేటి వెంకట రామారావు (పీవీఆర్) పుట్టినరోజు సందర్భంగా పేద బ్రాహ్మణులకు బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక కేశవస్వామి ఆలయంలో పీవీఆర్ అభిమానులు మంగరాతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పేద బ్రాహ్మణులకు ఈ సాయం అందచేశారు. అనంతరం అయోధ్య బలరాముని విగ్రహావిష్కరణను పురస్కరించుకుని తణుకులో పీవీఆర్ చేపట్టిన అయోధ్య బలరామ వైభవయాత్రలో సహకరించిన మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అయినంపూడి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, సింగం జగపతి, తణుకు పట్టణ అధ్యక్షుడు పెదమల్లు అవినాష్‌కాంత్, ఉపాధ్యక్షుడు రాసాబత్తుల అనుకుమార్, ప్రధాన కార్యదర్శి బొల్లాడ నాగరాజు, దాసరి వెంకటస్వామి, మహేష్, జనసేన నాయకులు బెజవాడ సూరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్యాత్మిక సేవలు మరువలేనివి



గిరి ప్రదక్షిణ చేసి తిరిగి వచ్చిన ఆర్టీసీ బస్సు, ప్రయాణికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమని పలువురు ప్రయాణికులు, భక్తులు కొనియాడారు. అరుణాచల గిరి ప్రదక్షిణ ప్రత్యేక బస్సు మంగళవారం పట్టణానికి చేరుకుంది. డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి, సిబ్బంది విజయవంతంగా తిరిగి వచ్చిన బస్సుకు ఘన స్వాగతం పలికారు. యాత్ర సౌకర్యవంతంగా పూర్తి చేసుకున్న యాత్రికులు మాట్లాడుతూ డ్రైవర్లు సహకారం, బస్సు కండిషన్, ఇతర సౌకర్యాల పట్ల హర్షం ప్రకటించారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, గిరి ప్రదక్షిణ, అనంతరం శివ కంచి, వామన కంచి, విష్ణు కంచి దర్శన భాగ్యం కలిగిందని వారు వివరించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆగస్టు 17వ తేదీన పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ ప్రత్యేక సౌకర్యం ఉంటుందని ఛార్జీ కేవలం రూ 2,600 మాత్రమేనని, కంచి వరకు రూ 3 వేలు ఉంటుందని, ఆన్ లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని చెప్పారు. మరిన్ని వివరాలకు 9959225488, 9959753102, 9985544411లకు సంప్రదించాలని కోరారు.

రేలంగిలో ఉచిత కంటి వైద్య శిబిరం



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం: లయన్స్‌క్లబ్ వారి సౌజన్యంతో గ్రామంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు చేతులు మీదుగా ఉచిత కంటి వైద్య శిబిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. రేలంగి గ్రామానికి చెందిన చొప్పెళ్ల కృష్ణ భార్య ఆపరేషన్ నిమిత్తం పసుపులేటి వెంకట రామారావు ఆర్థిక సహకారంతో రూ. 20వేలు అందజేశారు. పసుపులేటి వెంకట రామారావు జన్మదినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, మాజీ జెడ్పీటీసీ చుక్కా సాయిబాబా, ఉపసర్పంచ్ వడ్డి మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో ఉపకరణాలు కీలకం



మాట్లాడుతున్న హెచ్ఎం మూర్తి

తణుకు టౌన్: విద్యాబోధనలో ఉపకరణాలు ఎంతో కీలకమని హెచ్ఎం కే శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. శిక్ష సాప్తహ్ వారోత్సవాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంగళవారం తణుకు పైడిపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్ష సాప్తహ్ వారోత్సవాల్లో భాగంగా ఇంగ్లీష్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భాషా నైపుణ్య అవగాహనా కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు ఎం యేసుకృప మాట్లాడుతూ ఇంగ్లీష్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక భాషా నైపుణ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలలో ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన బోధనోపకరణాలను ప్రదర్శించా రు. ఉపాధ్యాయులు రామలక్ష్మీ, రామకృష్ణ, జయరాజు, విజయకుమారి, స్వరూపరాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందజేయాలి



జగన్నాథపురం పంచాయతీ ఈవో శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపు రైతాంగానికి ప్రభుత్వం పంట నష్టపరిహారం అందజేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని జగన్నాథపురం సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర కాలువ ముంపు రైతులందరికీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఉచితంగా అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ ఈవో కే.శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గ్రామ కమిటి అధ్యక్షుడు ఎం.విశ్వనాథం, కార్యదర్శి ముత్తా రాంబాబు, కమిటి సభ్యులు పిల్లా గాదినాయుడు, కోనవరపు నాగభూషణం, గుడిగంటల శ్రీను, పీలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వల్పకాలిక రకాలు వేసుకోవాలి



ఎర్రకాలువ ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపు రైతాంగం స్వల్పకాలిక రకాలను వేసుకోవాలని ఆచార్య ఎన్జీ.రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ పాలడుగు సత్యనారాయణ సూచించారు. మంగళవారం మండలంలోని ఎర్ర కాలువ ముంపు గ్రామాలైన మాధవరం, ఆరుళ్ల, నందమూరులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు లాగిన వెంటనే నాట్లు బాగుంటే బూస్టర్ డోస్ కింద యూరియా, పొటాష్ వేసుకోవాలన్నారు. అలాగే మాకోజెబ్ లేదా బావిస్టన్ మందు పిచికారి చేయాలన్నారు. కొందరు రైతులు తమకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించాలని కోరగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సత్యనారాయణ తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు, మార్టేరు వరి పరిశోధన స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్, కేవీకే ఉండి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లిఖార్జున్, పెదవేగి మొక్కజొన్న పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్, శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణాజీ, తాడేపల్లిగూడెం ఏడీఏ మురళీకృష్ణ, ఏవో ఆర్ఎస్.ప్రసాద్, సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, రైతులు బాలకృష్ణ, బెజవాడ శ్రీనివాస్, గూడవల్లి నాగేశ్వరరావు, శనగన రాంబాబు, దార్లంక రాముడంబు తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా ఆత్మబంధువుల సంఘం



వరద బాధితులకు సహాయం సేకరిస్తున్న సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఆత్మబంధువుల సంఘం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నిరాశ్రయులకు అండగా ఆత్మబంధువుల సంఘం నిలుస్తుందని పలువురు వక్తలు కొనియాడారు. వేలేరుపాడు మండలంలోని 11 గ్రామాల వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని కె.ఎన్.రోడ్డులో వస్తు సేకరణ కేంద్రం వద్ద మంగళవారం వరద బాధితులకు అవసరమయ్యే సామగ్రి కొనడానికి ఆత్మబంధువులం సేవా సంఘం (ఏబీఎఫ్) సభ్యులు అందరూ కలిసి రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. చెక్కును కేంద్రం వద్ద సేకరణ సభ్యులకు అందజేశారు. ఉషా కిరణ్ శీతాల, ఎస్‌వీఆర్ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కె.పెద్ద కృష్ణంరాజు, వాసవి ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ జి.సత్యనారాయణ, ఏబీఎఫ్ గౌరవాధ్యక్షుడు కడియాల పరశురామయ్య, అధ్యక్షులు వెజ్జు దుర్గాప్రసాద్, గీతా అంబికా, పరమాత్మ ప్రసాద్ బాబు, కేవీ చలం, కె.మురళీకృష్ణలు మాట్లాడుతూ బాధితులకు సహాయం అందించేందుకు ప్రజలు ముందుకు రావాలని, వస్తు రూపంలో బియ్యం, నిత్యవసర సరుకులు, వంట పాత్రలు, దుప్పట్లు, బట్టలు కేంద్రంలో అందజేయాలని కోరారు. వేలేరుపాడు మండలంలో వరద బాధితులకు అందజేస్తామని వివరించారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నేరం



ధూమపానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎన్‌హెచ్ఎం లీగల్ సెల్ ఆఫీసర్ పుట్టి శివ శంకర్, హైకోర్టు న్యాయవాది ప్రదీప్ హెచ్చరించారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల సంక్రమించే క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పొగాకు విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వ్యక్తులకు, విక్రయించే దుకాణ యజమానులకు చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మీ, టుటౌన్ ఎస్సై సీహెచ్ రమేష్, పి.సురేష్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



దర్శిపర్రు ఆయకట్టులో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న అంజిరెడ్డి తదితరులు

పెంటపాడు: వర్షాల ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర రైతుకార్యాచరణ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి అంజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెంటపాడు, దర్శిపర్రు గ్రామాలలోని ఆయకట్టు ప్రాంతాల రైతులను సందర్శించారు. గత నాలుగురోజులుగా నీటిలో ఉన్న నాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు నీటిలో ఉన్న నాట్లు తెరిపి ఇచ్చినా ఉపయోగం లేదన్నారు. రైతులు మరలా నారుమడులు వేసుకొని నాట్లు వేసుకొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సత్తి శేషారెడ్డి, వెలగల శ్రీనివాసరెడ్డి, మేడపాటి పల్లారెడ్డి, కొవ్వూరి తాతారెడ్డి, కర్రి పృథ్వీ, కర్రిశ్రీనివాసరెడ్డి, ఎలకల రామచంద్రరావు, ముమ్మిడి సాయిరాం, పెంటపాడు, దర్శిపర్రు గ్రామాలకు చెందిన కౌలు రైతులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ మీటర్ల ప్రారంభం

పెనుగొండ: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పెనుగొండలో క్లోరినేషన్ నీరు అందిస్తున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి తెలిపారు. మంగళవారం పంచాయతీ వద్ద లిక్విడ్ క్లోరినేషన్ మీటర్లు ప్రారంభించారు.మండా ప్రసాద్, సిద్ధిరెడ్డి స్వాతి హైమ, బాలం కనకదుర్గ, నీలిమారాణి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సహాయ కార్మిక అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చూపాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని సహాయ కార్మిక అధికారి కార్యాలయం వద్ద అధికారి గోపీ కుమార్‌ను ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దువ్వ శ్రీనివాస్, అత్తిలి బాబి, పోలిరాతి ఆది నారాయణ, కోడే సాయి, బాలాజీ, ఉప్పులూరి మధు తదితరులు పాల్గొన్నారు.